క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పూజలు



పూజలు చేస్తున్న ఎస్పీ రూపేశ్ దంపతులు

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంగారెడ్డి ఎస్పీ రూపేష్ దంపతులు హాజరై మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ధర్మకర్తలు వెంకటస్వామి, రాజు, వింజమూరి రమణ, సుమంత్, సురేష్ తదితరులు ఎస్పీకి ఘనస్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు ప్రజాదర్బార్

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ఇందిరా క్రాంతి భవనంలో జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై ప్రజాదర్బార్ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఏపీఓ రమేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

సంగారెడ్డి టౌన్: వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు రాబోయే ఎంపీ ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి ఏవో పరమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ

నారాయణఖేడ్: పట్టణ శివారులోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బెంగళూరు శ్రీసాయి అన్నపూర్ణ ట్రస్టు సౌజన్యంతో రాగిజావను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రబంధకారిణి కమిటీ సభ్యులు, పాఠశాల పూర్వ విద్యార్థులు దొప్ప వెంకటరమణ, డాక్టర్ అర్థం చంద్రశేఖర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు రాగిజావను పంపిణీ చేస్తామన్నారు.

బాలిక అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధికి చెందిన బాలిక 6వ తరగతి వరకు చదివి ఆతర్వాత చదువు మానేసి ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి రాత్రి పడుకుంది. తిరిగి ఉదయం 5 గంటలకు కుటుంబ సభ్యులు లేచి చూడగా బాలిక కనిపించలేదు. దీంతో బాలిక కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ తీగలు అమర్చితే చర్యలు

కల్హేర్(నారాయణఖేడ్): పంట పొలాల చుట్టూ కరెంట్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జొన్న, మొక్కజొన్న, వరి పంట పొలాల చుట్టూ కరెంట్ తీగలు అమర్చడంతో ప్రమాదవశాత్తు మనుషులు, పశువులు, అడవి జంతువులు షాక్‌తో మరణించే అవకాశం ఉందన్నారు. దీంతో కరెంట్ తీగలు అమర్చితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తులకు రగ్గులు పంపిణీ

జహీరాబాద్: మనూర్ మండల పరిధిలోని బెల్లాపూర్ నుంచి ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ ఆశ్రమానికి పాదయాత్రన వెళ్తున్న భక్తులకు సామాజిక సేవకుడు రాజుపాటిల్ ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు. అదేవిధంగా తాగునీరు, బటర్‌మిల్క్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, సిద్దేశ్వర స్వామి, ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

జిన్నారం(పటాన్‌చెరు): డీసీఎం వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ మండలం తొగర్‌పల్లి గ్రామానికి చెందిన పడమటి లక్ష్మణ్ గుమ్మడిదలలోని బంధువు అంత్యక్రియలకు బైక్‌పై వెళ్లి వస్తుండగా వీరన్నగూడ ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం అదుపు తప్పి లక్ష్మణ్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో లక్ష్మణ్ తలకు తీవ్రమైన గాయాలు కాగా సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తూనికల్లో తేడా.. కొలతల్లో దగా

ఎలక్ట్రానిక్ కాంటాలతో నష్టపోతున్న వినియోగదారులు

- వస్తువుల అమ్మకాల్లో నిలువు దోపిడీ
- అధికారుల తనిఖీలు శూన్యం

జిల్లాలోని సదాశివపేట, సంగారెడ్డి, అందోల్-జోగిపేట, జహీరాబాద్, పటాన్‌చెరు, తెల్లాపూర్, అమీన్‌పూర్, నారాయణఖేడ్, బొల్లారం పట్టణాలతో పాటు జిల్లాలోని 26 మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీల వరకు వ్యాపార, వాణిజ్య, చికెన్, మటన్, దుకాణాల్లో వినియోగించే కాంటాల్లో కిలోకు 50 గ్రాముల నుంచి 100 గ్రాముల తేడా వస్తుండటంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

> పండ్ల నుంచి కూరగాయల వరకు.. సిమెంటు నుంచి ఎరువుల వరకు... పెట్రోలు, డీజిల్.. ఇలా ప్రతి వస్తువు విక్రయంలోనూ జిల్లాలో భారీగా మోసాలు చోటుచేసుకుంటున్నాయి. ఓవైపు కల్తీ.. మరోవైపు తూకాల్లో మోసం.. ఫలితంగా వినియోగదారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించడంలేదు. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లో ఎక్కువగా మోసం జరుగుతోంది. కొన్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లను ట్యాంపరింగ్ చేస్తున్నాయి.
>
> – సదాశివపేట(సంగారెడ్డి)

కొరవడిన అధికారుల నిఘా

నిబంధనల మేరకు వ్యాపారులు వినియోగించే తూకం కాంటాలు, ఎలక్ట్రానిక్ కాంటాలు లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీ చేసి రెండేళ్ల కాలపరిమితితో లైసెన్సులు జారీ చేయాలి. నిబంధనలు పాటించని వారి దుకాణాలు, వివిధ వ్యాపార సముదాయాల్లో సోదాలు నిర్వహించి జరిమానాలు విధించాలి. అయితే జిల్లాలో ఎక్కడా సక్రమంగా తనిఖీలు అమలు కావడంలేదని వినియోగదారులు వాపోతున్నారు.

నాణ్యతలేని వస్తువుల విక్రయం

కూరగాయలు, కిరాణా దుకాణాలతో పాటు వారంతపు సంతల్లో అనుమతిలేని తక్కెడ త్రాసులు వినియోగిస్తున్నారు. తూనికలు కొలతలశాఖ నిఘా పూర్తిగా కొరవడటంతో ఇదే అదునుగా వ్యాపారులు వినియోగదారులను నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. అదేవిధంగా మార్కెట్లో నాణ్యతలేని నిత్యావసర వస్తువుల విక్రయాలు జరుగుతున్నా పట్టించుకునేనాథుడు కరువయ్యాడు. ఏ తూకంలో చూసినా కొలతల్లో తేడాలు వస్తుండటంతో తాము ఎవరికి చెప్పుకోవాలోనని వినియోగదారులు వాపోతున్నారు.





కిరాణా దుకాణంలోని ఎలక్ట్రానిక్ కాంటాలు

తనిఖీలు చేపట్టడంలేదు



కిరాణా, చికెన్, మటన్, కూరగాయల మార్కెట్లో తూనికల కొలతలశాఖ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో తూనికల్లో 50 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు తక్కువ కనిపిస్తోంది. దీంతో వినియోగదారులు మోసపోతున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. నిబంధనలు పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– జయరాములుగౌడ్, మాజీ కౌన్సిలర్, సదాశివపేట

వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



కిరాణా దుకాణాలతో పాటు వారంతపు సంతల్లో వినియోగిస్తున్న ఎలాక్ట్రానిక్ త్రాసుల కొలతల ద్వారా చాలా తేడాలు వస్తున్నాయి. ఇదేమని ప్రశ్నిస్తున్న వినియోగదారులను వ్యాపారులు పట్టించుకోవడంలేదు. అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టి మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులపై కేసులు నమోదు చేయాలి.

– పృథ్వీరాజ్, సదాశివపేట

పార్కింగ్‌తో జనం బేజార్

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ద్విచక్ర వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాల పార్కింగ్

పంట నష్టపరిహారం అందించాలి



నేలకొరిగిన జొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో నేలకొరిగిన జొన్నపంటను ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపోయిన పంటల వివరాలను అధికారులు నేటికీ సేకరించకపోవడంతో స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జిల్లా వ్యవసాయశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. నష్టపోయిన పంట వివరాలు సేకరించి నివేదికలు పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు నర్సింహులు, శంకరయ్య పాల్గొన్నారు.

నియామకం



శివరామకృష్ణకు నియామకపత్రాన్ని అందజేస్తున్న శివశంకరరావు

హత్నూర(సంగారెడ్డి): సునీతమ్మ సేవా స్వచ్ఛంద సంస్థ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేర్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన శివరామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు శివశంకరరావు మంగళవారం శివరామకృష్ణకు నియమాకపత్రాన్ని అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా సునితమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎంతో మందికి సహాయ, సహకారాలు అందిస్తూ సంస్థలో నిస్వార్థంగా సేవలందిస్తున్న శివరామకృష్ణ హత్నూర మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నియమించినట్లు శివశంకరరావు తెలిపారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

నారాయణఖేడ్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మంగళవారం నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని దుర్గాభవానీ మాత ఆలయం వద్ద నిజాంపేట- ఖేడ్- బీదర్ 161బీ జాతీయరహదారిపై డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో డీఎస్పీతో పాటు స్థానిక సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు



హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో హోలీ సంబరాలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

క్షయవ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి: ప్రతిఒక్కరూ క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ గాయత్రిదేవి అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం క్షయ వ్యాధిగ్రస్తులకు పండ్లు, ప్రోటీన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారి డాక్టర్ రాజేశ్వరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వ్యవస్థ వైవిధ్యమైనది

- ప్రొఫెసర్ మధుర స్వామినాథన్
- త్రిపుర రైతులపై పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మధుర స్వామినాథన్

పటాన్‌చెరు: భారతదేశంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎంతో వైవిధ్యభరితమైనదని బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్, ఆర్థిక విశ్లేషణ విభాగాధిపతి డాక్టర్ మధుర స్వామినాథన్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్స్‌లోని సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మధుర స్వామినాథన్ 'సమకాలీన భారతదేశంలో వ్యవసాయ సంబంధాలు' అనే అంశంపై ఆతిథ్య ఉపన్యాసం చేశారు. తమిళనాడులో గమనించిన మార్పులను ప్రస్తావిస్తూ గ్రామీణ భారతదేశంలోని వ్యవసాయ సంబంధాల సంక్లిష్ట స్వభావంపై ఉపన్యసించారు. గ్రామీణ రుణం, భూమి యాజమాన్యం, గ్రామీణ భారతంపై పెట్టుబడిదారీ విధానం వంటి సమస్యలను వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు సంధించిన ప్రశ్నలకు జవాబులిచ్చారు. అనంతరం సోషియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాకిబ్ ఖాన్ రచించిన ట్రైబ్ క్లాస్ లింకేజ్, త్రిపురలోని రైతాంగ ఉద్యమ చరిత్ర, రాజకీయాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సినాప్సి ప్రథమ వార్షికోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేసిన పాఠశాల యాజమాన్యం

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలోని సినాప్సి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రాజుగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని వివరించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అతివేగంతో వాహనాలు నడుపొద్దు



రక్తదాతకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న డీఎస్పీ సత్తయ్య

సంగారెడ్డి: అతివేగంతో వాహనాలు నడుపొద్దని డీఎస్పీ సత్తయ్య అన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు కుమారుడు ప్రశాంత్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత్ గొప్ప భవిష్యత్తు ఉన్న యువకుడని, చిన్నతనంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఇంతటి దుఃఖంలో సైతం ఇతరులకు సేవ చేయాలన్న ఆలోచనలతో రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, హాస్పిటల్ సూపరింటిండెంట్ అనిల్‌కుమార్, పట్టణ సీఐ భాస్కర్, ప్రజా సంఘాల నాయకులు మానిక్, యాదగిరి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాజు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

హత్నూర(సంగారెడ్డి): కంది మండల పరిధిలోని ఆరుట్ల గ్రామ శివారులో ఉన్న జీవీఆర్ కంకర క్రషర్ ఎదుట గుండ్ల మాచునూర్ మంగళవారం గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బైఠాయించి ఆందోళన దిగారు. వివరాల్లోకి వెళ్తే... సోమవారం రాత్రి కంకర క్రషర్ నుంచి వెళ్తున్న టిప్పర్ ఢీకొని గుండ్ల మాచునూర్ గ్రామానికి చెందిన మొండి కృష్ణ (58) అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున క్రషర్ వద్దకు చేరుకుని మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, స్థానిక నాయకులు కంకర క్రషర్ యాజమాన్యంతో ఫోన్ ద్వారా మాట్లాడి రూ.15లక్షల ఆర్థికసాయం అందించేవిధంగా ఒప్పించారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.



కంకర క్రషర్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్తులు, నాయకులు

ఘనంగా బోనాలు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కుప్పనగర్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ బోనాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల మధ్య ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

పంటల సాగుపై అవగాహన

కొండాపూర్(సంగారెడ్డి): రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా కొండాపూర్‌లోని రైతువేదిక వద్ద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గొర్రెల పెంపకం, డ్రోన్‌లతో వ్యవసాయంతో పాటు నేరుగా విత్తనాలు విత్తడం తదితర అంశంపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి నర్సింగరావు, డీహెచ్‌ఎస్‌ఓ శ్రీధర్, ఏడీఏ మనోహర, ఏఓ ప్రతిభ, ఏఈఓలు రవి, ఆత్మసిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల అడ్డగింత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అల్లీనగర్ గ్రామ పరిధిలోని బామనకుంటను ఆక్రమించి చేపడుతున్న అక్రమ నిర్మాణాలను మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. పరిశ్రమల పేరుతో కొంతమంది అక్రమార్కులు కుంటను ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల కోరుతున్నారు.



పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఉజ్వల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు

జహీరాబాద్: ఉజ్వల్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గ్లోబల్ ఆస్పత్రిలో మంగళవారం ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు. గత నెల రోజుల క్రితం ట్రస్ట్ ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించగా అందులో ఆపరేషన్ల కోసం గుర్తించిన నలుగురికి ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. మిగతా వారికి కూడా త్వరలో ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆపరేషన్లు చేయించేందుకు ముందుకు వచ్చిన ఉజ్వల్‌రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



ఆపరేషన్లు చేయించుకున్న మహిళలు

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

జిన్నారం(పటాన్‌చెరు): అతిగా మద్యం తాగి కంకర క్రషర్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జిన్నారం మండలంలోని ఖాజిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. బొల్లారం సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా తిమ్మనాయుడుపల్లి గ్రామానికి చెందిన కృష్ణపాటి శ్రీనివాస్‌రెడ్డి ఖాజిపల్లి గ్రామ శివారులోని ఓ కంకర క్రషర్‌లో కార్మికుడిగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శ్రీనివాస్‌రెడ్డి మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అతిగా మద్యం తాగిన శ్రీనివాస్‌రెడ్డి కంకర క్రషర్ వద్దనే పడి మృతి చెందాడు. మృతుడి సోదరుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.